పెన్ పవర్ ప్రకాశం

# స్వచ్ఛత ఆత్మగౌరవ సంకేతం

## ప్రతి 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర,. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

## - జిల్లా కలెక్టర్ రాజాబాబు







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 15**

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యంతో పాటు ఆత్మ గౌరవంతో జీవనం సాగించవచ్చని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. శనివారం సంతనూతలపాడు మండలం, మద్దులూరు గ్రామ పంచాయతీ లో జరిగిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, స్థానిక శాసన సభ్యులు బి ఎన్ విజయకుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ, ప్రతి నెలా మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా ఈ రోజు సంతనూతలపాడు మండలం, ముద్దలూరు గ్రామంలో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక శాసన సభ్యులు, అధికారులతో కలసి రావడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛత మీద ఒక కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల్లో శుభ్రత గురించి అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఒక వ్యక్తి పరిశుభ్రంగా ఉంటే వారి కుటుంబం పరిశుభ్రంగా ఉంటుందని, తద్వారా సమాజమంతా పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వలన దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు కలిగిస్తాయని, తడి, పొడి చెత్తలను వేరు చేసి డస్ట్ బిన్స్ లో వేయాలని తెలిపారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ విషయంలో సామూహికంగా కృషి చేయాలన్నారు. వీధులు, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వాతావరణం, గాలి కూడా పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, టాయిలెట్ కి వెళ్ళిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి, తినే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. శాసన సభ్యులు బి. ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మద్దులూరు గ్రామానికి రావడం జరిగిదన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించడం చాలా ముఖ్యమన్నారు. అలాగే ఇంటితో పాటు పరిసరాలను ముఖ్యంగా సైడు కాలువలు, మురుగు కాలువలను ప్రతి రోజు శుభ్రంగా ఉంచుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ప్రతి ఒక్కరు శుభ్రత పాటించినట్లయితే ఆరోగ్యకరమైన జీవనం సాగించకలుగతారన్నారు.

అనంతరం పారిశుధ్య కార్మికులను సాలువ కప్పి సన్మానించారు. తొలుత జిల్లా కలెక్టర్, శాసన సభ్యులతో కలసి మద్దులూరు ఎస్. సి కాలనీని సందర్శించి కాలనీ ప్రజలతో మాట్లాడి, వ్యక్తిగత పరిశుభ్రత, రోజు వారీ క్లాప్ మిత్రాలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం గురించి, చెత్త నిర్వహణ, తాగు నీటి వినియోగం, మరుగుదొడ్ల వినియోగం వంటి అంశాలపై స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కమ్యూనిటి హాల్, బస్షెల్టర్, స్కూల్ ప్రహరి గోడ అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి, పిల్లలతో కలసి స్వయంగా చేతులు కడిగి పరిశీలించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు, మెప్మా పిడి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కన్నుల పండగగా

# వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

## 50 ఏళ్ల నిరీక్షణ తర్వాత తెప్పోత్సవం -భారీగా పాల్గొన్న భక్తులు



**తర్లుపాడు పెన్ పవర్ నవంబర్15**

తర్లుపాడు మండలం తర్లుపాడు గ్రామం లో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవం శనివారం కన్నుల పండుగ గా జరిగింది. సుమారు 50సంవత్సరాల తరువాత తెప్పొత్సవం చేయడం గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పూజల అనంతరం వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళల నడుమ ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం చెరువులో కన్నులపండువగా తెప్పోత్సవం జరిపారు. ఈ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి తమ తమ కోరికలు నెరవేర్చాలంటూ భక్తులు స్వామివారిని వేడుకున్నారు.



# సేవకు సత్కారం - తుఫాను వేళ అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు..

# సిబ్బంది సేవలను కొనియాడిన జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు













**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 15**

సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సమర్థ పర్యవేక్షణతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. మొంథా తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించిన తీరే దీనికి నిదర్శనమని చెప్పారు. తుఫాను సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చురుకుగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానోత్సవం శనివారం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో జరిగింది. కలెక్టర్ తో పాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విపత్తుల సమయంలో ఎదురైన పరిస్థితులను, అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ తుఫాను సమయంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు పనిచేయటం వలన జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ప్రజల నుంచి ప్రశంసలు పొందడంతో పాటు మీ బిడ్డలకు కూడా స్ఫూర్తిగా నిలిచారు. ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా విధుల నిర్వహణలో చూపి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలి అని పిలుపునిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య మంచి సమన్వయం ఉండటం వలన క్షేత్రస్థాయి ఉద్యోగులు సకాలంలో స్పందించి పరిస్థితిని త్వరగా చక్కదిద్దినట్లు చెప్పారు. ముఖ్యంగా కొండేపిలో ఎస్సై చురుకుగా వ్యవహరించి 121 మంది పొగాకు కూలీలను ఎస్.డీ.ఆర్.ఎఫ్. బృందం సహాయంతో సురక్షితంగా తరలించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. విపత్తుల సమయంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు, ఎన్నికల నిర్వహణ సమయంలో స్పందించిన తీరే ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యానికి నిదర్శనంగా ఉంటుందన్నారు. తాజా తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగ శక్తి సామర్థ్యాలు నిరూపితమయ్యాయి అన్నారు. దీనిని ఒక అనుభవంగా తీసుకుని ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిఆర్ఓ బి.చిన ఓబులేసు మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ పరిస్థితిని నిశితంగా నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయటం వలన ప్రజలకు సేవలు, బాధితులకు పరిహారం అందించడంలో ఎవరి నుంచీ ఎలాంటి విమర్శలు రాలేదన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్, డి.ఆర్.ఓ, ఆర్డీవోలతో పాటు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, సిబ్బందిని కలెక్టర్, ఎస్పీ సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. పలువురు జిల్లాస్థాయి అధికారులు, తహసిల్దార్లు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# వెంకటేశ్వర స్వామి ని నిలువు దోపిడీ చేసిన దొంగలు దొరికారు

## నెల లోపే దొంగ తనాన్ని చేధించిన పోలీసులు -8 కేజీ ల వెండి ఆభరణాలు స్వాధీనం

## 1500 గ్రా గంజాయి మూడు సెల్ ఫోన్లు, డీలక్స్ బైక్ స్వాధీనం

## ముద్దాయిలందరు పాత నెరస్థు లే మార్కాపురం డి వై ఎస్ పి నాగ రాజు








**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

గిద్దలూరు పట్టణంలో రాచర్ల రోడ్డు లోగల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత నెల 23 వ తేదీ న గుర్తు తెలియని దొంగలు పడి స్వామి వారి 10 కేజీ ల వెండి ఆభరణాలు దోచుకొని వెళ్లారు. ఈ కేసు ను జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పోలీసు బృందాల ను ఏర్పాటు చేసి నెల లోపే దొంగ తనాన్ని ఛేదించి స్వామి వారి ఆభరణాలు స్వాధీనం చేసుకుని విధంగా గట్టి చర్యలు చేపట్టారు. ఆ చర్యల నేపథ్యంలో నే పోలీసు బృందాలు నేర పరిశోధన చేసి శ్రీ వారి ఆభరణాలు దొంగిలించిన వ్యక్తి తో పాటు మరో ఇద్దరి ని అరెస్ట్ చేసి వారి నుండి దొంగిలించిన స్వామి వారి ఆభరణాల ను స్వాధీనం చేసుకున్నారు. వారి లో ఒక వ్యక్తి పరారీ లో ఉన్నట్లు ఆ వ్యక్తి ని కూడా త్వరలోనే పట్టుకుంటామని డి వై ఎస్పీ నాగ రాజు తెలిపారు. డి వై ఎస్పీ వివరించి న ప్రకారం గుంటూరు జిల్లా అంకిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన వడ్లమాను శివా రెడ్డి అనే వ్యక్తి అక్టోబర్ 23 రాత్రి రాచర్ల రోడ్డు లో ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ తలుపులు పగులగొట్టి స్వామి వారి ని అలంకరించి ఉన్న వెండి ఆభరణాల ను దోచుకొని శ్రీ వారి ని నిలువు దోపిడీ చేశారు. ఆ సమయంలో ఆలయం లో ఉన్న సి సి కెమెరాల వైర్ల ను కూడా తొలగించి శ్రీ వారి ని అలంకరించి ఉన్న సుమారు పది కేజీ ల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. 24 వ తేదీ ఉదయం ఆలయ అర్చకులు ఆలయం కు వెళ్లగా దొంగ తనం జరిగినట్లు గ్రహించి పోలీసు ల కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి పోలీసు జాగిలాలను,క్లూస్ టీమ్ రప్పించి నేర పరిశోధన చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో నే గుంటూరు జిల్లా అంకిరెడ్డి పల్లె కు చెందిన వడ్లమాను శివా రెడ్డి గా గుర్తించటం జరిగిందన్నారు. ఈ కేసు ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితుడు శివా రెడ్డి ని పట్టుకునేందుకు పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శివా రెడ్డి కోసం అన్వేషిస్తూ ఉండగా ముద్దాయి గా ఉన్న వడ్ల మాను శివా రెడ్డి గిద్దలూరు మండలం కొత్త పల్లి గ్రామంలో గల కోటా శ్రీను వెంచర్ లో సంచరిస్తుండగా అతన్ని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి చోరి కి గురైన సొత్తు ను స్వాధీనం చేస్కున్నామన్నారు. కాకుండా దొంగ తనం అనంతరం శివా రెడ్డి కి సహాయ సహకారం అందించిన గుంటూరు జిల్లా పొన్నూరు మండలం లగ పాలెం కు చెందిన జెట్టిపోయిన ప్రవీణ్ అతని సోదరుడు జెట్టిపోయిన ప్రదీప్ లను కూడా అరెస్ట్ చేశారు. ఈ దొంగిలించిన సొత్తు లో సుమారు 3 కేజీ ల వెండి ని కరిగించారని వెండి ని కరిగించేందుకు ఆన్లైన్ లో వెండిని కరిగించే యంత్రాన్ని కూడా కొనుగోలు చేసినట్లు డి వై ఎస్పీ తెలిపారు. ముద్దాయి వడ్లమాను శివారెడ్డి పై సుమారు40 యాభై కేసులు నమోదయ్యాయి అని ఇతనికి దేవాలయాల్లో దొంగతనాలు చేస్తూ గంజాయి అమ్ముకుంటు జీవనం సాగిస్తుంటాడని శివా రెడ్డి పై తాడేపల్లి ,గుంటూరు, పత్తి పాడు,చీరాల, బాపట్ల ,రేపల్లె ,బద్వేల్, అద్దంకి, మెదరమెట్ల, సింగరాయకొండ,ఒంగోలు తదితర ప్రాంతాల్లో ని పోలీసు స్టేషన్ ల ల్లో కేసు లు నమోదై ఉన్నాయని ఇటీవల నే జరుగుమల్లి లో ఒక కేసులో అరెస్టు అయ్యి కొద్ది రోజుల క్రితం విడుదల అయ్యాడాని పేర్కొన్నారు. ఈ కేసు ఛేదించే విషయం లో సి సి ఐ జగదీష్,సుధాకర్ తదితరులు కూడా పాల్గొన్నార ని తెలిపారు. నిందితుల నుండి వెండి ఆభరణాల తో పాటు ఒక సెల్ ఫోన్ ఒక డీలక్స్ బైక్ ను స్వాధీనం చేసుకోగా ప్రవీణ్, ప్రదీప్ నుండి కరిగించిన వెండి ముద్ద లను రెండు టచ్ సెల్ ఫోన్ ను శివా రెడ్డి నుండి వెండి కరిగించే మిషన్ ను ,1500 గ్రా గంజాయి ని స్వాధీనం చేస్కున్నామన్నారు. ఈ దొంగ తనం కేసు ను త్వరితగతిన చేధించిన గిద్దలూరు అర్బన్ సి ఐ కె. సురేష్, ఒంగోలు సి సి ఎస్ సి ఐ సుధాకర్, ట్రాఫిక్ సి ఐ జగదీష్,పోలీసు సిబ్బంది ని డి వై ఎస్ పి నాగ రాజు అభినందించారు. పరారీ లో ఉన్న మరో నిందితుడు నాగ రాజు ను త్వరలో నే అరెస్ట్ చేస్తామని ఆయన అన్నారు. ఈ చోరి సొత్తు ను ఈ నలుగురు దొంగలు 60-40 శాతం లో పంచుకుంటారని డి వై ఎస్ పి తెలిపారు.

## ఆదివాసీ నాయకుడు భగవాన్ బిర్సముండా జన్మదిన వేడుకలు



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

ఆదివాసీ నాయకుడు భగవాన్ బిర్సముండా 150 జన్మదిన సందర్భంగా గిద్దలూరు లో భగవాన్ బిర్సా ముండా ఫొటోకు భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా బీసీ పూలమాల వేసి జోహార్లు హర్పించిన భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా బీసీ అధ్యయన కమిటీ కన్వీనర్ కేతిగుంట్ల సుబ్బారాయుడు, ఎస్సి మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మట్టిమల్ల పుల్లయ్య , ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గసభ్యులు నున్న విరచక్రం ,బీజేపీ గిద్దలూరు నియోజకవర్గం కో కన్వీనర్ గుమ్మరాముడు ల ఆధ్వర్యంలో పూలమాల ,వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాచర్ల కాసులు , బీజేపీ నియోజకవర్గం సీనియర్ నాయకులు శిదర్ల రమేష్ , బీజేపీ నాయకులు పాల్గొన్నారు .

## శ్రీగిరి శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 15**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఒంగోలుకు చెందిన పులిపాక వెంకట చలపతి.. విజయ కుమారి.. వెంకట సాయి చైతన్య మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయడంతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన పులిపాక వెంకట చలపతి కుటుంబ సభ్యులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు , ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు అభినందించారు.

## కలెక్టర్ నుంచి ప్రశంషా పత్రం అందుకున్న వర్క్ ఇన్స్పెక్టర్



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు ఇరిగేషన్ ఆఫీసులో వర్క్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్నా బొర్రా శేఖర్ యాదవ్ కు మొన్న మెంతా తుఫాన్ సమయంలో మూడు మండలాల చెరువులను ఎలాంటి ఇబ్బంది లేకుండా కాపాడినందుకు జిల్లా కలెక్టర్ రాజబాబు చేతుల మీదుగా ప్రశంషా పత్రం అందుకున్నారు.

## కేతగడిపి పంచాయితీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన మస్తాన్

**తర్లుపాడు పెన్ పవర్ నవంబర్15**

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం కేతగడిపిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నా రాంబాబు పాల్గొన్నారు. గ్రామంలో ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బి పెద్దమస్తాన్ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైసీపీకి మద్దతు తెలపడం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.



# కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సద్గుణ రావు మృతి

అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలు ఆసుపత్రిలో కన్నుమూసిన సద్గుణ రావు

ఏడాది మే 13వ తేదీన కొమరోలు జి జె సి ప్రిన్సిపాల్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సద్గుణ రావు.

సద్గుణ రావు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి ఆవేదన వ్యక్తం చేసిన ఆర్ ఐ ఓ ఆంజనేయులు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది. విద్యార్థులు.



**కొమరోలు పెన్ పవర్ నవంబరు 15.**

కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీక సద్గుణ రావు(60) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి ఒంగోలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సద్గుణ రావు సన్నిహితులు తెలిపారు. సద్గుణ రావు అకాల మృతి పట్ల ఒంగోలు ఆర్ఐఓ ఆంజనేయులు, కొమరోలు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురైయ్యారు. కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న సద్గుణ రావు గత వారంలో స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. దీనితో ఆయన రెండు సెలవు పెట్టి తన కుటుంబం నివాసం ఉంటున్న ఒంగోలు సమీపంలోని కబాడీ పాలెం కు వెళ్లారు. సద్గుణ రావు స్వగ్రామం కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామం కాగా ఆయన కుటుంబం కబాడీపాలెంలో ఉంటున్నది. ఊపిరితిత్తులల్లో వచ్చిన ఇన్ఫెక్షన్ కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న సద్గుణరావును కుటుంబ సభ్యులు మొదట ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు .అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో సద్గుణరావును విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన ఆరోగ్య పరిస్థితి రోజుకు రోజుకు క్షీణిస్తూ ఉండటంతో శ్రేయోభిలాషుల సలహా మేరకు సద్గుణ రావును గత రెండు రోజుల క్రితం ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సద్గుణ రావు శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచినట్లుగా ఆయన సన్నిహితులు, కొమరోలు కళాశాల అధ్యాపకులు తెలిపారు. మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ గా పనిచేస్తున్న సద్గుణ రావు కు ప్రిన్సిపాల్ గా పదోన్నతి కల్పించి కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించారు. దీనితో సద్గుణ రావు ఈ ఏడాది మే 13వ తేదీన కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి కళాశాల అభివృద్ధిపై విద్యార్థుల సంఖ్య పెంపుదలపై దృష్టి సారించారు .వేసవి సెలవులలో కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, బోధ నేతల సిబ్బందితో కలిసి మండలంలోని గ్రామ గ్రామాన క్యాంపెనింగ్ లు నిర్వహించి తమ కళాశాలలో విద్యార్థులు చేర్పించాలని వారి తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు విన్నవించారు. ఆ మేరకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది .అధ్యాపకులతో సోదర భావంతో మెలుగుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు సహకారంతో కృషి చేశారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతుగా పాటుపడ్డారు. విద్యార్థులను తన కన్న బిడ్డల వలె చూసుకుంటూ వారితో వ్యక్తిగతంగా మాట్లాడుతూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ విద్యార్థులందరూ ప్రతిరోజు సక్రమంగా కళాశాలకు వచ్చే విధంగా వారిని ప్రోత్సహించారు. . తమతో సోదర భావంగా మెలుగుతూ తమ అందరికీ ఆదర్శంగా ఉంటూ ఉన్న ప్రిన్సిపాల్ సద్గుణ రావు మృతి తమకు తీరని ఆవేదనకు గురి చేసిందని ఆ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ,భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు .ఇక విద్యార్థులు కూడా ప్రిన్సిపాల్ ఇక లేరు అనే వార్తను జీర్ణించుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. కొమరోలు కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రభాకర్ రావు, లోకేష్ యాదవ్, హర్షవర్ధన్ రెడ్డి, యూ డి సి కిషోర్ ప్రిన్సిపల్ సద్గుణరావు మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సద్గుణరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రిన్సిపాల్ సద్గుణ రావు కన్నుమూశాలనే సమాచారం అందుకున్న ఒంగోలు ఆర్ ఐ ఓ ఆంజనేయులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి ఒంగోలు వెళ్లి సద్గుణ రావుకు నివాళులర్పించి ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఇంటర్మీడియట్ బోర్డు క్రమశిక్షణ గల , విధుల పట్ల అంకితభావం గల ఒక మంచి ప్రిన్సిపాల్ ను కోల్పోయిందని ఆర్ ఐ ఓ ఆంజనేయులు తెలిపారు.

# కష్టానికి దక్కిన గౌరవం..!



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 15**

తుఫాను బీభత్సంలో ప్రాణాలను పణంగా పెట్టి చిక్కుకున్న ప్రయాణికులను కాపాడిన పోలీసు అధికారి ధైర్యసాహసానికి జిల్లా అధికారులు సత్కారం చేశారు. గత నెల మోంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పుల్లల చెరువు వెల్దుర్తి రహదారిపై అర్ధరాత్రి బస్సులు వరద నీటిలో నిలిచిపోయిన విషయం తెలిసిందే.ఒకవైపు వాగు ఉప్పొంగి రోడ్డును మింగేస్తుంటే%లల% మరోవైపు బస్సులో ఉన్న ప్రయాణికులు ఆందోళనతో సహాయం కోసం ఎదురుచూశారు.ఈ సమాచారాన్ని అందుకున్న పుల్లల చెరువు ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్ ప్రమాదాన్ని లెక్కచేయకుండా వెంటనే అక్కడికి బయలుదేరి పోలీస్‌స్టేషన్ పరిమితిని దాటి సుమారు 10 కిలోమీటర్ల దూరం వర్షంలో, చీకట్లో, నీటిలోంచి వెళ్లి,వెంటనే హైవే సిబ్బందిని అప్రమత్తం చేసి జేసీబీలు, టిప్పర్లు అక్కడికి రప్పించారు. వాటి సహాయంతో వరదలో చిక్కుకున్న బస్సులను ఒక్కొక్కటిగా లాగించి సురక్షిత ప్రదేశమైన ఎర్రగొండపాలెం వైపు తరలించారు. రాత్రంతా అలసట లేకుండా పర్యవేక్షించిన ఎస్ఐ సంపత్ కుమార్ చాకచక్యంతో ప్రయాణికులంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా రక్షించారు.ఈ సంఘటనపై స్పందించిన ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజా బాబు, ఎస్పీ హర్షవర్ధన్ ఎస్ఐ సంపత్‌కుమార్ సేవలను ప్రశంసిస్తూ ఆయనకు అభినందన పత్రాలు అందజేశారు.

# పొదిలిలో ఘనంగా జాతీయ గౌరవ దివస్ వేడుకలు

**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 15**

పొదిలిలో శనివారం నాడు జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల బిజెపి కార్యాలయంలో జిల్లా బిజెపి అధికార ప్రతినిధి, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. బిజెపి కార్యాలయంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు దివంగత బీర్సా ముండా చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భారతదేశ ఆదివాసి స్వాతంత్ర పోరాటంలో అద్భుతమైన చరిత్ర సృష్టించిన బీర్సా ముండాను ప్రజలు ప్రేమగా




భూమిపుత్రుడు అని పిలిచేవారని చెప్పారు. బ్రిటిష్ పాలనకు ఎదు రెడ్డి పోరాడిన మహోన్నతుడు బీర్సా ముండాగా విజయలక్ష్మి అభివర్ణించారు. అటువంటి మహనీయుని పుట్టినరోజు ఆయన గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం జన జాతి గౌరవ దివస్ గా ప్రకటించడం జరిగిందన్నారు. బీర్సా ముండా లాంటి మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, నాయకులు ఆకుపాటి లక్ష్మణ, ఎన్ నాగేశ్వరరావు, ఎస్.కె రఫీ, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మన పరిసరాల పరిశుభ్రత కూడా మన బాధ్యత

## గిద్దలూరు పట్టణంలో రూ.15 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

## పట్టణ ప్రజల కోసం రూ. 2కోట్ల రూపాయలతో వాకింగ్ ట్రాక్ మరియు పార్కుల అభివృద్ధి

## స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల








**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

మనవ్యక్తిగత శుభ్రతతో పాటు మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు గిద్దలూరు పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు సెంటర్లో గిద్దలూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మొదటగా పారిశుద్ధ కార్మికులను కలుసుకొని వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. గిద్దలూరు పరిధిలో తెల్లవారుజామునే లేచి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల శ్రమ ఎంతో ఉందని వారిని అభినందించారు. అనంతరం శ్రీ పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాల వేసి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ,నాయకులతో కలిసి స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిద్దలూరు పట్టణంలో 15 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. అదే విధంగా గిద్దలూరు పట్టణ ప్రజల సౌకర్యార్థం రెండు కోట్ల రూపాయలతో వాకింగ్ ట్రాక్ తో కూడిన పార్క్, చిల్డ్రన్స్ పార్క్ ను అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నగరాల అభివృద్ధి గ్రామాలను అభివృద్ధి చేయటం తమ బాధ్యత అన్నారు.

ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు శానేశావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, టిడిపి నాయకులు దప్పిలి కాశిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ గడ్డం భాస్కర్ రెడ్డి, మరియు పట్టణ కౌన్సిలర్లు బిల్లా రమేష్, లోక్కు రమేష్, బి. చంద్రశేఖర్, నాయకులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుసేవ కేంద్రాలలో పంటల జాబితా విడుదల.

## ఏవో.షేక్. మహమ్మద్.





**పెన్ పవర్, కంభం నవంబర్ 15**

కంభం మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో ఖరీఫ్ 2025 సంబంధించి ఈ పంట జాబితాలనుసామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగినదని, కంభం మండల వ్యవసాయ అధికారి షేక్. మహమ్మద్ తెలిపారు. కందులాపురం ఎల్ కోట గ్రామాల్లో ప్రదర్శించిన జాబితాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ యొక్క పేర్లు సర్వే నంబర్లు,పంటల వివరాలు, విస్తీర్ణము వివరాలు చూసుకొని, తేడాలు ఉంటే వెంటనే రైతు సేవ కేంద్రంలో తెలియజేసి సరి చేసుకోవాలని, అలాగే పంట నమోదు జాబితా లో అభ్యంతరాలు ఉన్నా తెలియపరచాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# పిల్లలకు స్వచ్ఛత గురించి అవగాహన కల్పించాలి

– నగర మేయర్ గంగాడ సుజాత




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 15**

ప్రతి నెల 3 శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా శనివారం రాంనగర్ 2 వ లైన్ నందు ఉన్న మునిసిపల్ హై స్కూల్ లో చదుచుతున్న పిల్లలకు వ్యక్తిగత శుభ్రత – సమాజ పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ, చిన్న వయసు నుంచే పిల్లకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించటం వల్ల భవిష్యత్ లో మన సమాజం చక్కటి పరిశుభ్రత తో ఉంటుందని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత తో మనం మనదగ్గరకి చేరబోయే వ్యాధులను దూరం చేయగలమని తెలిపారు. అలానే సమాజ పరిశుభ్రత అనగా మన చుట్టుపక్కల కూడా పరిశుభ్రతగా ఉండే విధంగా చేసినట్లు ఐతే మనమే కాకుండా అందరూ కూడా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమము లో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ రామ్ భూపాల్ రెడ్డి, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ నూకతోటి పిచ్చయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ సుబ్బయ్య, మునిసిపల్ స్కూల్ ఉపాధ్యాయులు, వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ దొనకొండ రైల్వే స్టేషన్ ను తనిఖీలు

**దొనకొండ నవంబర్ 15 పెన్ పవర్**

మండలంలోని స్థానిక రైల్వే స్టేషన్ సాధారణ తనిఖీల్లో భాగంగా ఈరోజు గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ సుదేష్న సేన్, ప్రత్యేక ట్రైన్ లో గుంటూరు డివిజన్లోని పలు రైల్వే స్టేషన్లు తనిఖీలు నిర్వహిస్తూ దొనకొండకు వచ్చారు అనంతరం ప్లాట్ఫారం మరియు స్టేషన్ అవుట్ సైడ్ మరియు లావెట్రీస్, త్రాగునీరు, బ్రిడ్జి మరమ్మత్తులు జరుగుతున్న వర్కులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ప్రయాణికుల నిమిత్తం సౌచాలయం లావెట్రీస్ మరమత్తులు చేయించి తక్షణమే ఓపెన్ చేయాలని రైల్వే స్టేషన్ మరమ్మత్తులు కూడా అతి త్వరగా వేగంగా చేయించు లాగున పర్యవేక్షించాలని అలాగే త్రాగునీరు సమస్య లేకుండా చేయాలని ప్రయాణికుల సౌకర్యార్థం పలు సూచనలు తెలియజేస్తూ రెండో నెంబర్ ప్లాట్ఫారం మొదటి ప్లాట్ఫారం స్వయంగా తానే పరిశీలి అధికారులతో మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం . జి ఎన్ టి . ఎడిఆర్ఎం. గతి శక్తి . జి ఎన్ టి . డీసీఎం . జి ఎన్ టి . డి ఈ ఈ . కార్డినేషన్ జి ఎన్ టి . డి ఈ ఈ . మెయింటెనెన్స్ . జి ఎన్ టి . డి ఈ ఎన్ . డబ్ల్యూ . జి ఎన్ టి తో పాటు ఉన్నారు.



# ప్రిన్సిపాల్ సద్గుణ రావు మృతి పట్ల కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల సంతాపం

## సంతాప సభలో కన్నీటి పర్యంతమైన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు.

## సద్గుణ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అధ్యాపకులు ,విద్యార్థులు.



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 15**

కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పని చేస్తూ శుక్రవారం రాత్రి ఒంగోలు ఆసుపత్రిలో మృతి చెందిన పీకా సద్గుణ రావు( 60) మృతి పట్ల సంతాపంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంతాప సభ నిర్వహించి, నివాళులర్పించారు. కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఆరు మాసాలుగా ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న పీకా సద్గుణ రావు లంగ్స్ ఇన్ఫెక్షన్ వ్యాధితో బాధపడుతూ శు క్రవారం రాత్రి ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు .ఆ సమాచారం అందుకున్న కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి ఆవేదన గురయ్యారు. ఒంగోలు ఆర్ ఐ ఓ ఆంజనేయులు ఆదేశాల మేరకు కళాశాల సీనియర్ ధ్యాపకులు ప్రభాకర్ రావు, అబ్బూరి అల్లూరయ్య ,రవి నాయక్ తదితర అధ్యాపకుల ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం కళాశాల ఆవరణలో సంతాప సభ నిర్వహించారు .ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రిన్సిపాల్ సద్గుణ రావు చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు నివాళులర్పించి కన్నీటి పర్యంతమై భావోద్వేగాన్ని గురయ్యారు. సంతాప సభలో అధ్యాపకులు మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ సద్గుణ రావుఎంతో సౌమ్యులని, సహృదయులని ,విధుల పట్ల అంకిత భావం , క్రమశిక్షణ తోకూడిన నాయకత్వం గల అధికారి అని వారు పేర్కొన్నారు. అధ్యాపకులను తోటి సోదరుల వలె భావించి ప్రేమానురాగాలు పంచి పెట్టారని వారు పేర్కొంటూ నివాళులర్పించారు. కళాశాల, కొమరోలు మండలం ఒక మంచి క్రమశిక్షణ, సేవా భావం గల ప్రిన్సిపాల్ ను కోల్పోయిందని పేర్కొన్నారు. సద్గుణ రావు ప్రిన్సిపల్ గా బాధితులు స్వీకరించి ఆరు నెలల కాలం అయినప్పటికీ కళాశాల అభివృద్ధికి ,విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు ఆయన చేసిన కృషి మరువరానిదని అన్నారు. కళాశాలను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేసి ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని భావించే వారిని తెలిపారు. మంచి క్రమశిక్షణ విధుల పట్ల అంకితభావం గల ఒక మంచి ప్రిన్సిపాల్ ను తాము కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు . కళాశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు కళాశాల చరిత్రలో ఇలాంటి విషాదకర ,దురదృష్టకర సంఘటనలు ఎప్పుడూ జరగలేదని, ఆదర్శ, అంకితభావాలు గల ప్రిన్సిపాల్ సద్గుణ రావు అకాల మృతి చెందడం కళాశాలకు ,కొమరోలు మండలానికి తీరని లోటు అని ఆ కళాశాల పూర్వ విద్యార్థి సీనియర్ జర్నలిస్ట్ గోల్కొండ షేక్ మహబూబ్ వలి పేర్కొంటూ ప్రిన్సిపాల్ సద్గుణ రా మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు .ఆ సందర్భంగా తమ ప్రిన్సిపాల్ ఇక లేరు అనే వార్తను జీర్ణించుకోలేక విద్యార్థులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. కొమరోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సద్గుణ రావు అకాల మృతి పట్ల ఒంగోలు ఆర్ఐఓ ఆంజనేయులు ,ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం చైర్మన్ కుమ్మరకుంట సురేష్ ,కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ రావు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ సద్గుణ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

## అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్ 15**

పట్టణంలోని తర్లపాడు రోడ్డులో గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ ను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ తనిఖీలు చేశారు. తనిఖీలో భాగంగా హాస్టల్ పరిసరాలను, విద్యార్థినిల గదులను, వంటశాల స్టోర్ రూమ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ తనిఖీకి వచ్చే లోపు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని హెచ్చరించారు. సమయానికి భోజనం, వసతులు, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థినులకు సరైన భోజనం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం మండల లీగల్ అథారిటీ సర్వీస్ చైర్మన్ ఆధ్వర్యంలో మండల న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు అన్వర్ బేగ్, ఉషశ్రీ, పారా లీగల్ వాలంటీర్స్ భాష, ఆదినారాయణ, పవన్ కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫైటర్ ఆఫ్ మంథా"గా కమిషనర్ రమణబాబు



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15:**

మంథా తుఫాను సమయంలో చూపిన విశేష సేవలకు గుర్తింపుగా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణ బాబుకు ప్రకాశం జిల్లా కలెక్టర్ – జిల్లా మేజిస్ట్రేట్ పి. రాజా బాబు, చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రకృతి విపత్తు అత్యవసర పరిస్థితుల్లో కమిషనర్ ప్రదర్శించిన నాయకత్వం, సమయోచిత నిర్ణయాలు, ప్రజలను రక్షించేందుకు తీసుకున్న సంసిద్ధత చర్యలు అధికారుల ప్రశంసలను అందుకున్నాయి.తుఫాను మంథా ప్రభావం తీవ్రంగా నమోదైన సమయంలో మున్సిపల్ పరిపాలన యంత్రాంగాన్ని అప్రమత్తంగా నిలిపి, సహాయక చర్యలను వేగవంతంగా అమలు చేసిన రమణ బాబు ఫైటర్ ఆఫ్ మంథా"గా జిల్లా అధికారుల అభినందనలు పొందారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన వసతులు, రక్షణ చర్యలు, పునరావాస కార్యక్రమాలను సమన్వయం చేసిన తీరు ఆదర్శప్రాయమైందని అధికారులు పేర్కొన్నారు.జిల్లాలో ప్రజా సేవలో అత్యున్నత ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనంగా రమణ బాబు సేవలు నిలిచాయని తెలియజేస్తూ, ప్రకాశం జిల్లా కలెక్టర్ – జిల్లా మేజిస్ట్రేట్ పి. రాజా బాబు, ., ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

# విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను అలవరుచుకోవాలి

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్ 15**

స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల మూడవ శనివారం వ్యక్తిగత పరిశుభ్రత – సామాజిక పరిశుభ్రత అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దోర్నాల బస్టాండు సెంటర్, తర్లుపాడు రోడ్ లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం ఇన్చార్జి సబ్ కలెక్టర్ ఎం శివరామిరెడ్డి, కమిషనర్ డి.వి.ఎస్ నారాయణరావు , గౌరవ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య వ్యక్తిగత పరిశుభ్రత గురించి పట్టణ ప్రజలకు, సాంఘిక సంక్షేమ వసతి గృహ బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పట్టణ ప్రజలు, వసతి గృహ బాలికలు, మున్సిపల్ ,సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



# డెడికేటెడ్ కమిషన్ వేసి-బీసీల సమగ్ర కులగణన జరిపించాలి

## : జాడి శ్వేత



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత డిమాండ్ చేశారు. శుక్రవారం గిద్దలూరు లో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వాన్ని కోరారు.ఇదే అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు "బీసీ జనగణన- వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడమేనంటూ" హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయడం అందరికీ తెలిసిందే అన్నారు. అందులో భాగంగా హైకోర్టు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి,పంచాయతీరాజ్- పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు నోటీసులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్-జస్టిస్ చల్లా గుణరంజన్ లతో కూడిన ధర్మాసనం"పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని, తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా"వేసిందన్నారు. తమ తరపు సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్"ప్రతిసారి ఎన్నికల సమయం వచ్చేవరకు జనగణనలో బీసీల కుల గణనను చేయకపోవడంతో,వేలాది పదవులను బీసీలు కోల్పోయేలా తీవ్ర అన్యాయం జరుగుతుందని వాదించారన్నారు. అలాగే బీసీ కులాలలోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం దక్కాలంటే విద్యా ఉద్యోగాలలో ఏ విధంగా ఏబిసిడి వర్గీకరణ జరిగిందో, అదేవిధంగా స్థానిక సంస్థల రిజర్వేషన్లను కూడా వర్గీకరించి మాత్రమే అమలు జరపాల్సి ఉందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగియుటకు అటు-ఇటుగా 6 నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించుకునే వేసులుబాటు ఉన్నందున,మొత్తం ప్రక్రియను 2026 ఏప్రిల్ కల్లా పూర్తి చేసి, చట్టబద్ధ బీసీ రిజర్వేషన్లు అమలు జరపాలన్నారు.రాష్ట్రంలో ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్ ను అత్యధిక మెజారిటీతో ఎన్నుకున్నందున,కేంద్రంతో సంప్రదించి సదరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించి,బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు జరపాలని కోరారు ఈ సమావేశంలో పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

## మార్కాపురం జిల్లాగా వెంటనే ప్రకటించాలి -మార్కాపురం జిల్లా సాధన సమితి నాయకుల డిమాండ్

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్15**

మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లా నేటికి ఏర్పడకపోవడంతో నూతన జిల్లాగా వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ మార్కాపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్'క్లబ్'లో శనివారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి సాధన సమితి నాయకులు డీకేఎం రఫీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ షేక్ సైదా సాధన సమితి నాయకులతో కలిసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం పర్యటనలో, ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ లు యువగలం యాత్రలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జిల్లా ప్రకటిస్తామని చేసిన వాగ్దానాలను అమలుపరిస్తూ వెంటనే జిల్లాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని నాయకుల స్వార్థానికి వెనుకబడిన పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా కాలేకపోయిందని ధ్వజమెత్తారు. 65 రోజుల మార్కాపురం జిల్లా ఏర్పాటు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన కూటమి నాయకులు ముందుకు రావాలని కోరారు. కో కన్వీనర్ అందె నాసరయ్య మాట్లాడుతూ మార్కాపురం నూతన జిల్లా



ఏర్పాటుకు సానుకూలత ఉన్నప్పటికి మంత్రివర్గ ఉప సంఘం చేసిన నిర్ణయాలను ఈ నెలలో జరిగిన క్యాబినెట్'లో ఆమోదింప చేయకపో వడంతో పాటు నాన్సుడు ధోరణి అవలంబిస్తూ జిల్లాలో ఇటీవల చంద్రబాబు కనిగిరి పర్యటనలో మార్కాపురం జిల్లా ఊసెత్తకపోవడం అనుమానాలు రేకెత్తుతున్నాయని అన్నారు. సాధన సమితి నాయకులు దగ్గుబాటి సోమయ్య, వి.సుదర్శన్, షేక్ రజాక్, షేక్ ఖాసిం'లు మాట్లాడుతూ వచ్చే క్యాబినెట్ సమావేశంలోనే జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించకపోతే ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ఈ జిల్లాలోని



ప్రజాప్రతినిధుల ఇళ్లను సైతం ముట్టడించటానికి వెనుకాడబోమని, వారిపై ఒత్తిడి తీసుకొచ్చి జిల్లాను ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయిస్తామని అన్నారు. ముందస్తుగా ఈనెల 24వ తేదిన సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమ్రాన్, గుమ్మా బాలనాగయ్య, పి.రూబేన్, గాలి వెంకటరామిరెడ్డి, షేక్ మహబూబ్ వలీ మరియు రాజకీయ పార్టీల నాయకులతో పాటు కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం ఆవాస్ యోజన 2.0 సర్వేను వేగవంతం చేయాలి

**సర్వే చేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించిన గిద్దలూరు హౌసింగ్ డి ఈ ఖదీర్ భాష, కొమరోలు ఏఈ కృష్ణారెడ్డి.**

**అర్హులైన లబ్ధిదారులు పక్కా గృహాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలి.**





**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 15**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకమునకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న సర్వేను శనివారం గిద్దలూరు హౌసింగ్ డిఈ షేక్ ఖదీర్ భాష, కొమరోలు హౌసింగ్ ఏఈ జి కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. పి ఎం ఏ వై 2.0 పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను రాష్ట్ర ప్రభుత్వం సర్వేయర్లుగా నియమించింది. వారు గ్రామాలలో పర్యటిస్తూ సర్వేలను నిర్వహిస్తున్నారు .అయితే సర్వేయర్ల పనితీరు తెలుసుకోవడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు సూచనలు సలహాలు ఇచ్చేందుకు శనివారం గిద్దలూరు హౌసింగ్ డిఇ షేక్ ఖదీర్ భాష ,కొమరోలు హౌసింగ్ ఏఈ జి కృష్ణారెడ్డి కొమరోలు మండలంలోని దద్దవాడ ,గుండ్రెడ్డి పల్లె గ్రామాలలో పర్యటించి సర్వేయర్ల పనితీరును పరిశీలించి సమీక్షించారు .ఆ సందర్భంగా ఖదీర్ భాష సర్వేయర్లకు పలు సూచనలు సలహాలు ఇస్తూ ఈనెల 30వ తేదీలోగా సర్వేను పూర్తి చేయవలసి ఉన్నదని అందువల్ల సర్వేను వేగవంతం చేసి లక్షసాధన వైపు అడుగులు వేస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. అంతేగాక ఆయా గ్రామాలలోని అర్హులైన లబ్ధిదారులు పక్క గృహాల మంజూరుకు ఈ నెల 30వ తేదీల్లోగా తమ వివరాలను సర్వేర్లకు అందజేయాలన్నారు. పక్కా గృహాలు లేని లబ్ధిదారులు తమ ఇళ్ల పట్టాలను ,ఆధార్ కార్డు , బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం ,ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ,కుల ,ఆదాయ సర్టిఫికెట్లు తదితర వాటిని సకాలంలో సర్వేలకు అందజేసి ,తమ ఇంటి స్థలాలను సర్వే చేయించుకోవాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో కొమరోలు హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, లబ్ధిదారులు ,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఉగ్ర కు మహాపుష్పయాగం ఆహ్వానం



**సి ఎస్ పురం,పెన్ పవర్ నవంబర్ 15**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నారాయణస్వామి దేవస్థానం లో నేడు (16వ తేదీ) జరగనున్న కార్తీక మాసోత్సవాల వేడుకలకు సంబంధించి శ్రీ నారాయణస్వామి కి శ్రీ శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివార్లకు మహా పుష్పయాగం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మహోత్సవాల్లో భాగంగా మహా పుష్ప యాగం కార్యక్రమానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి శ్రీ నారాయణ స్వామి ని దర్శించుకుని మహా పుష్పయాగం కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు.

# గ్రంధాలయం మేధస్సును పెంచే బాండాగారం

## గ్రంధాపాలాకురాలు కటికెలా ఝన్సీ




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 15**

గ్రంధాలయం సరదాగా సమయాన్ని కేటాయించే పుస్తకాల గది కాదని, విద్యార్థి మొదలు ఉద్యోగాల పోటీకి ఉపయోగపడేవారి,మేధస్సును పెంచే బాండాగారామని గ్రంధాపాలకురాలు కటికెలా జాన్సి అన్నారు. 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలా సందర్భంగా స్థానిక గ్రంధాలయం లో విద్యార్థిని విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. 80మంది విద్యార్థులకు పుస్తకప్రదర్శన, పుస్తకసమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ పుస్తకాలు మన నేస్తాలని పుస్తకాలు నిత్యం మనలో కొత్త కొత్త విజ్ఞాన్ని మన మేధస్సులో పరిజ్ఞానం నింపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాపూజీ,తెలుగు ఉపాధ్యాయులు ఖాసీం బాషా పాల్గొని ప్రసంగించారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛతా కార్యక్రమం





**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 15**

ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో తమ పాత్రను పోషిస్తూ ప్రకాశం జిల్లా పోలీసులు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం (ప్రతి నెల మూడవ శనివారం) ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు.. సిబ్బంది కలసి జిల్లా పోలీసు కార్యాలయం సహా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ కార్యాలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించారు. గుణపం, పారలు ఉపయోగించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. మురుగునీటి పారుదల కాలువలను శుభ్రం చేసి, పరిసరాలను పరిశుభ్రం చేయడానికి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అన్ని పోలీస్ స్టేషన్ లలో పోలీస్ అధికారులు, సిబ్బంది కలసి శుభ్రం చేయడంతో పాటు ఆవరణం, చుట్టూ ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. గుణపం, పారలు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చు. మన చుట్టూ ఉంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత. సమాజంలో శాంతియుత వాతావరణం, పరిశుభ్రమైన వాతావరణం రెండూ సమానంగా ముఖ్యమని భావించి పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రైతు బజార్లలో రాయితీ ధరలతో బియ్యం కంది పప్పు

## - ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

## జాయింట్ కలెక్టర్ వెల్లడి





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 15**

ప్రస్తుతం కూరగాయలు, బియ్యం, కందిపప్పు మొదలైన నిత్యావసర సరుకుల ధరల స్థిరీకరణలో భాగంగా అన్నీ రైతు బజార్లయందు శనివారం నుండి బియ్యం, కందిపప్పునకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడమైనదని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ అన్నారు. ఇందులో భాగంగా జాయింట్ కలెక్టర్, రైతు బజార్ల కో ఆర్డినేటరు గోపాలకృష్ణ సాయిబాబా గుడి రైతు బజారును విజిట్ చేసి ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించారు. బియ్యం (బిపిటి రకం) కేజి: రూ.48/-లు, కందిపప్పు కేజి:రూ.100/- లకు అమ్మకములు జరుపుతున్నట్లు తెలిపారు. కొంత మంది వినియోగదారులతో కూడా మాట్లాడి, అన్ని రైతు బజార్లయందు ప్రత్యేక కౌంటర్లు ద్వారా అమ్మకములు జరుపుతున్నట్లు చర్యలు తీసుకొనవలసినదిగా మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. రైతు బజార్ల యందు ధరల పట్టికను పరిశీలించి ధరల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా రైతు బజార్లను సందర్శించిన జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఏ. డి. మార్కెటింగ్, రైతు బజారు అధికారులకు కొన్ని సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డి.యస్. ఒ, ఏ. డి. మార్కెటింగ్, సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్లు, రైతు బజారు ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన విధులకు గుర్తింపుగా ఘన సత్కారం

## తాసిల్దార్ చిరంజీవిని ఘనంగా సత్కరించి, ప్రశంసించిన కలెక్టర్ రాజబాబు

**మార్కాపురం టౌన్ 10 పవర్ నవంబర్ 15**

మెంత తుఫాన్ కు మండల పరిధిలో ప్రజలకు ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ఎమ్మార్వో చిరంజీవి విధులు నిర్వహించారు. అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా విధులు నిర్వహించినందుకు మార్కాపురం తాహసిల్దార్ చిరంజీవి కి కలెక్టర్ రాజబాబు ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఎస్పీ విజయ వర్ధన్ రాజు,పలువురు జిల్లా అధికారులు ఉన్నారు.




# శ్రీగోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం నూతన కమిటీ ఎన్నిక

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్15**

రాచర్ల మండలంలోని శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన ఆవరణలో ఉన్న శ్రీగోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం అధ్యక్షులు వేల్పుల పెద్ద రాజయ్య అధ్యక్షతన శనివారం సమావేశం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యాదవ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.వెంకటయ్య యాదవ్,ప్రకాశం జిల్లా అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షులు యం.గురు ప్రసాద్ యాదవ్, రాష్ట్ర యాదవ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు డాక్టర్ యం.పిచ్చయ్య యాదవ్ లు హాజరయ్యారు. ఈ సమావేశంలో గత రెండు సంవత్సరాలుగా పాత కమిటీ చేసిన అభివృద్ధి పనులను, ఆర్థిక విషయాలను తెలియజేశారు. అనంతరం యం.గురు ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షులుగా బొల్లవరం నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పాశం వెంకట నర్సయ్య యాదవ్, ట్రెజరర్ గా వలసాని శ్రీనివాసులు యాదవ్ యాదవ్ , సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ



సభ్యులతో ఓ. వెంకటయ్య యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాముల సుబ్బరాయుడు యాదవ్, మహేంద్ర యాదవ్, నరసింహా యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, రాజ గోపాల్ యాదవ్, వెంకటస్వామి యాదవ్,రోషయ్య యాదవ్, రవికాంత్ యాదవ్,శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు

## కొమరోలు ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో మానవహారాన్ని నిర్వహించిన అధికారులు.





**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 15**

ప్రజలకు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించేందుకు శనివారం కొమరోలు ఎంపీడీవో సానికొమ్ము సత్యం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. చేతుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ చేతుల పరిశుభ్రత వలన కలిగే లాభాలను వివరిస్తూ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేతులను పరిశుభ్రంగా ఉంచుకునే విధానాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు .ఆ సందర్భంగా సమావేశానికి హాజరైన అధికారులు సిబ్బంది పొదుపు సంఘాల మహిళలు వివోఏలు సబ్బు ,నీళ్ళతో చేతులు శుభ్రం చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, పొదుపు సంఘాల మహిళలు వివోఏలు పలు కార్యాలయాల సిబ్బందితో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయ కోడలు వరకు ర్యాలీ నిర్వహించారు .అక్కడ మానవారంగా ఏర్పడి వ్యక్తిగత పరిశుభ్రత ,ఇంటి పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ,వీధుల పరిశుభ్రత ,గ్రామాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు .ఆ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యం మాట్లాడుతూ, అంటువ్యాధుల నుంచి విముక్తి పొందేందుకు చేతుల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. మలమూత్రాల విసర్జన అనంతరం తప్పనిసరిగా చేతులను శుభ్రపరచుకోవాలని ,అంతేకాక ఆహారం తీసుకునే ముందు కూడా చేతిలో శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు .పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అమలు చేస్తున్నదని, అందువల్ల ప్రజలు ఆ కార్యక్రమాల్లో పాల్గొని పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలని ఆయన కోరారు .ఆ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, మండల పరిషత్ పంచాయతీరాజ్ ఏఈ ఈరయ్య ,కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య ,కొమరోలు గ్రామ సచివాలయ2 కార్యదర్శి ఓ ఆర్ జనార్ధన్ రెడ్డి తో పాటు గ్రామ సచివాలయాల సిబ్బంది ,పలు శాఖల సిబ్బంది ,పొదుపు సంఘాల మహిళలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి సన్ షైన్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 15**

పొదిలి లోని సన్ షైన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సన్ షైన్ ఉన్నత పాఠశాల నిర్వాహకులు సూ రా వెంకటేశ్వరరెడ్డి, పద్మజ దంపతులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు టెక్నాలజీని ఏ మేరకు వినియోగించుకోవాలో వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, భావి భారత పౌరులుగా ఎదగడంతోపాటు తమ తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను సఫలం చేయాలని వెంకటేశ్వర రెడ్డి, పద్మజ లు కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అలాగే ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జి కాశిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు మన నేస్తాలు

### జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 15**

ప్రకాశం జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు 58 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన కు జిల్లా ఫుడ్ ఆఫీసర్ శివా తేజ, అగ్రికల్చర్ అధికారిణి రజిని కుమారి ప్రారంభించారు. తదుపరి గ్రంధాలయల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు సందేశం ఇచ్చారు. డాన్స్, పాటల పోటీలు, ఫ్యాన్సి డ్రెస్, రాంప్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్వేతా డాన్స్ టీచర్ జడ్జి గా వ్యవహరించారు.

## ఎన్డిఏ కూటమి విజయంతో సి.ఎస్.పురం బిజెపి నాయకులు సంబరాలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 15**

శుక్రవారం వెలువడిన బీహార్ ఎన్నికల ఫలితాల్లో బిజెపి సారథ్యంలోని ఎన్ డి ఏ కూటమి భారీ విజయం సాధించడంతో మండల కేంద్రంలో సి ఎస్ పురం లో బీజేపీ నాయకులు బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం బాణా సంచా పేల్చి, స్వీట్లు పంచి జై నరేంద్ర మోడీ జై బిజెపి నినాదాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు కొండిశెట్టి వెంకటరమణయ్య మాట్లాడుతూ బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటమి భారీ విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. నరేంద్ర మోడీ పరిపాలనలో అన్ని రాష్ట్ర ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. బీహార్ ఎన్నికల్లో బీజేపీ గురించి తప్పుగా మాట్లాడిన వారికి ఈ ఫలితాలు చెంపపెట్టు అన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాధారణ పొందిన పార్టీగా బీజేపీ పార్టీ నిలిచిందని అన్నారు. ప్రజలందరూ కూడా కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన సీట్లే ఇందుకు నిదర్శనం అని అన్నారు కాంగ్రెస్ పార్టీ భారత దేశాన్ని ముక్కలు గా విడదీసి పరిపాలించాలని ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ , తమిళనాడు మరియు ఇతర రాష్ట్రాలలో ఎక్కడ ఎన్నికలు జరిగిన ఘన విజయం సాధిస్తుందని రాబోవు జరుగునున్న రాష్ట్ర ఎన్నికలలో ఇదే మాదిరిగా అత్యధిక మెజార్టీతో వివిధ రాష్ట్రాలను కైవసం చేసుకుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇండ్ల సత్యం, మండల కన్వీనర్ పాశం రామ కృష్ణ మండల బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





# మైనారిటీల సంక్షేమం టిడిపి లక్ష్యం

- ఇమామ్.. మౌజన్ ల గౌరవ వేతనం రూ. 90 కోట్లు విడుదల
- హర్షం వ్యక్తం చేసిన టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హనీఫ్ ఖాన్



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 15**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ముస్లింల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం, వారి రక్షణ కోసం అన్నివేళలా వారికి అండగా ఉంటూ వారి అభివృద్ధి కోసం పాటుపడుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇమామ్ మౌజన్ ల గౌరవ వేతనాలకు సంబంధించిన 90 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి మరో మారు రుజువు చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పఠాన్ హనీఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా.. ఇమామ్ మరియు మౌజన్లకు గౌరవ వేతనాలను కోసం రూ. 90 కొట్లు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు. ముస్లిం మైనార్టీల కోసం కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మైనారిటీల పక్షపాతి అని నిరూపించుకుంటుందని అన్నారు. ఎంత ఆర్థిక భారమైన పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వం పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలను రాష్ట్ర ప్రజలు నమ్ముతారని భావిస్తే వైఎస్ జగన్ కన్నా రాజకీయ అవివేకులు మరొకరు ఉండరని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూసి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా అన్ని విధాలుగా మోసం చేసిందని విమర్శించారు. నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడిందని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం పాటుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్, ఒంగోలు శాసనసభ్యులు.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు లకు ముస్లిం మైనారిటీల తరపున హనీఫ్ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులు విడుదల కావడానికి కృషి చేసిన ఏపీ రాష్ట్ర మైనారిటీ సలహాదారులు ఎం.ఏ షరీఫ్, మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అజీజ్ లకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# అంగన్వాడి ప్రీ స్కూల్స్ బలోపేతం చేయాలి

## ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్.



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

అంగన్వాడి ప్రీస్కూల్స్ బలోపేతం చేయాలని, మూడు సంవత్సరాల నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు అంగన్వాడి సెంటర్లో ఉండే విధంగా జీవో ఇవ్వాలని, అంగన్వాడి ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, ఎఫ్ ఆర్ ఎస్ యాప్ రద్దు చేయాలి మెనూ క్వాంటిటీ పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు అదన పనులు అప్ప చెప్పరాదని ఆన్లైన్ వర్క్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయాల్లో అంగన్వాడి లబ్ది పొందుతున్న లబ్ధిదారులతో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు ఏమున్నా, అంగన్వాడి టీచర్లు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, మహబుబీనీ, కాశమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యువతలో పుస్తక పఠనాభిలాశను అలవర్చాలి

## మస్తక భూషణం పుస్తకం -ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోనిశాఖా గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నాడు పుస్తక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని మహిత పాల్గొని సరస్వతిదేవి విగ్రహానికి పూల మాలవేసి , పుస్తక ప్రదర్శన ను ప్రారంభించారు. ఈ సంధర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి వ్యాయామం ఎంత ముఖ్యమో మానసిక దృఢ త్వాన్ని పెంపొందించేందుకు పుస్తకాలు అంతే అవసరం అన్నారు పుస్తక పఠనం జీవితాన్ని తేజోవంతంచేసి చక్కటి ఆకృతిని ఇస్తుందన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతి యువకులకు అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందు బాటులో ఉంటాయని చిరిగిన చొక్కా ఐన ధరించు కాని ఒక కొత్త పుస్తకం కొనుగోలు చేసి చదువుకోవాలన్నారు గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాల బాలికలు చదరంగ పోటీలు క్యారమ్స్ పోటీలు నిర్వహణ. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎన్.ప్రసన్న కుమారి మహిళా శిశుసం క్షేమ శాఖ సీనియర్ సహాయకులు జాకీర్ హుస్సేన్ జూనియర్ సహా యకులు విజయశ్రీ గ్రంథాలయ అభివృ ద్ధికమిటీ అధ్య క్షులు బి. రామి రెడ్డి ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కార్యదర్శి ఎస్డి ఫరూఖ్ విశ్రాంత ఉద్యో గులు డి. నారాయణరెడ్డిపి .వెంకట్రా మిరెడ్డి విద్యా ర్థులు పాఠకులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష

- పాల్గొన్న కమిటీ చైర్మన్ ఎంపీ మాగుంట




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 15**

మహారాష్ట్ర రాష్ట్రంలో వివిధ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల, కార్యక్రమాల పురోగతి పై గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటన సందర్భంగా ముంబయిలోని హోటల్ తాజ్ మహల్ ప్యాలెస్ లో కమిటీ ఛైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమీక్ష సమావేశంలో మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం, గృహ.. పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ (ఆర్థిక మంత్రిత్వ శాఖ), ముంబై స్మార్ట్ సిటీ సిఇఒ, బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్, ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్, హుడ్కో, ఎన్బిసిసి, సిపిడబ్ల్యుడి, ఎనెచ్చి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రతినిధులతో.. కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్, అమృత్, అమృత్ 2.0, ఎంఏవై(యు), పీఎం స్వనిధి, ఎన్ యు డి ఎం, పి యం ఈ బస్ సేవ తదితర అంశాలపై సమీక్షించారు.

# వైయస్సార్ సీపీ స్టేట్ డాక్టర్స్ విభాగం సెక్రెటరీ గా డాక్టర్ మక్బూల్ భాష

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్15**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ డాక్టర్స్ విభాగం సెక్రెటరీగా డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాష నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి శనివారం ఆయనకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. ఈయన మార్కాపురం ప్రాంతంలో ప్రజలకు బాగా సుపరిచితులు. వైసీపీ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు.గతంలో మున్సిపల్ కౌన్సిల్ లో కోఆప్షన్ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే డాక్టర్ మక్బూల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మిత్ర మండలి లో ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా ఆయనకి ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్, ఆ పార్టీ ఇంటలేక్చువల్ విభాగం రాష్ట్ర సెక్రెటరీ, ఆర్యవైశ్య అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మేడా వెంకట బద్రీనాథ్,బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ లతో పాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



# కొండికందుకూరులో దోమల నివారణకు ఫాగింగ్



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 15**

మండలంలోని కొండికందుకూరు గ్రామంలో దోమల నివారణకు పాగింగ్ చేయించినట్లు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బ్రహ్మయ్య దోమల బెడదను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు గ్రామంలో అన్ని వీధుల్లో ఫాగింగ్ నిర్వహించినట్లు తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఘట్టమనేని రాంబాబు,ఎం యల్ హెచ్ పి హరిత, ఆశ వర్కర్ స్వాతి, జువ్విగుంట రమేష్, మెడబలిమి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ ఆదాయం రూ. 14,39,921



**వలేటివారిపాలెం పెన్ పవర్. నవంబర్ 15**

అయ్యవారిపల్లి పంచాయతీ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిదేవస్థానంను దర్శించుకొనుటకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం భక్తుల ద్వారా వివిధ రూపాల ద్వారారూ. 14,39,921 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయకార్య నిర్వాహనాదికారిఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అష్టోత్రం ద్వారా రూ.10, 850, కుంకుమార్చన ద్వారా రూ14,880లు , తలనీలాలద్వారా రూ35, 725 లు,వాహన పూజలద్వారా రూ.3,560లు , ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,97,400లు , స్థల పురాణం ద్వారా రూ.540 ,రూముఅద్దెలు ద్వారా రూ.32,490లు , కవర్లు ద్వారా రూ.9,800లు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ2,12,695లు,అన్న ప్రసాదముద్వారా రూ 7,13,465 రూపాయలు, ఇతర విరాళాలు2,516రూ, వివాహముల ద్వారా 6,000 రూపాయలు మొత్తం 14,39,921రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమీషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్ నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వెంకటేశ్వర స్వామి సన్నిధిలో రేనాటి వెంకటేశ్వర్లు పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 15**

ప్రముఖ పుణ్యక్షేత్రం వరికుంటపాడు వైకుంఠపురం శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం సి ఎస్ పురం పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, సంగిశెట్టి పేరయ్య నాయుడు, పట్నం తిరుపతయ్య, పోకల మాల్యాద్రి, రామారావు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్చకులు గోత్రనామాలు, మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కానిస్టేబుల్ నాయబ్ రసూల్‌కి గాయాలు..

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**

గిద్దలూరు పట్టం శివారులో గిద్దలూరు-ఒంగోలు హైవే రోడ్డులో మిస్టర్ చాయ్ దుకాణ సమీపంలో ఎపి 26 సి ఏ 0111 నెంబరు గల కారు బ్లూపోర్స్ డ్యూటీలో ఉన్న షేక్ నాయబ్ రసూల్ , సయ్యద్ కాజా పీరా 100 నెంబరుకు కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ కారును ఆపి సమాచారం సేకరిస్తుండగా కార్ డ్రైవర్ కానిస్టేబుల్ కు కారు ను తగిలించి పరార్ కావడం తో కానిస్టేబుల్ కు గాయాలు అయ్యాయి. గాయాల పాలైన కానిస్టేబుల్ నాయబ్ రసూల్ను ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అందిస్తున్నారు . పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాలలో ఆనందోత్సవాలతో సాగిన బాలల దినోత్సవ వేడుకలు

## చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ.

**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 14**

కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ఎం పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఆనందోత్సవాలతో సాగాయి. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ వై రేవతి అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ నారాయణమ్మ, ప్రధానోపాధ్యాయులు బంధుగుల వెంకటసుబ్బారెడ్డి, ఎస్ ఎల్ వి సొసైటీ చైర్మన్ బంధుగుల వెంకట రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేదికపై ఏర్పాటు చేసిన చాచా నెహ్రూ చిత్రపటానికి ఆ పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ పూలమాల వేసిన నివాళులు అర్పించగా ప్రిన్సిపాల్ రేవతి ,ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ,ఎస్ ఎల్ వి సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి చాచా నెహ్రూకు ఘన నివాళులర్పించారు. ఆ సందర్భంగా , కరస్పాండెంట్ నారాయణమ్మ మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ గొప్ప విద్యావేత్త మహోన్నత విలువలు వల గొప్ప రాజకీయ నాయకులని, అలాంటి గొప్ప వ్యక్తి భారతదేశానికి తొలి ప్రధాని కావడం దేశ ప్రజల అదృష్టం అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ, చిన్న పిల్లలంటే చాచా నెహ్రూకు ఎనలేని అభిమానమని ,అందువలన ఆయన తన పుట్టినరోజును చిన్న పిల్లల మధ్య జరుపుకునే వారని తెలిపారు .అందువల్ల నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం గా జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తున్నదని పేర్కొన్నారు. హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి






మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రాన్ని సాధించి పెట్టడంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూ కృషి అభినందనీయమని దేశ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువరానివని పేర్కొన్నారు. ఎస్ ఎల్ వి సోసైటీ చైర్మన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వ కార్యక్రమాలలో విరామం లేకుండా ఉంటున్నప్పటికీ తీరిక చేసుకొని ప్రతిరోజు తమ ఉద్యానవనంలో కొద్దిసేపు చిన్నారులతో ముచ్చటించి వారికి చాక్లెట్లు పంచిపెట్టే వారిని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఆ పాఠశాల చిన్నారులు వివిధ రకాల దుస్తులలో అందంగా అలంకరించుకుని రావటంతో పాఠశాల ఆవరణ చూడముచ్చటగా మారింది. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విప్రోలో 95 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు

## ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలకు ప్రతిష్ఠాత్మక విజయం

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 15:**

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఈ విద్యాసంవత్సరంలో ప్లేస్‌మెంట్ రంగంలో మరో కీలక ఘట్టాన్ని నమోదు చేసింది. నవంబర్ 14న జరిగిన విప్రో ఆన్ క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన తుది సంవత్సరం విద్యార్థులలో మొత్తం 95 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు విప్రో సంస్థ నుంచి అధికారిక నియామక మెయిల్స్ కళాశాలకు అందాయి.ఈ నియామకాలు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖల విద్యార్థులకు లభించాయి. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ వంటి దశలను విజయవంతంగా పూర్తి చేసి విద్యార్థులు ఉద్యోగాలను పొందారు. విజయాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో వేడుకలు జరిగాయి. క్యాంపస్ ఆనందోత్సాహాలతో ఉల్లాసభరితంగా మారింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో కళాశాల నుండి మొత్తం ఐదువందలకుపైగా ఉద్యోగ ఆఫర్ లెటర్లు రావడం గర్వకారణమని తెలిపారు. ఐటీ రంగం చవిచూస్తున్న సవాళ్ల నేపథ్యంలో 95 మంది విద్యార్థులు విప్రోలో ఎంపిక కావడం సంస్థ నిబద్ధత, శిక్షణా విధానానికి నిదర్శనమని అన్నారు. ముఖ్యంగా సివిల్, మెకానికల్, ఈఈఈ శాఖల్లో వంద శాతం ప్లేస్‌మెంట్లు నమోదు కావడం విశేషమని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచే అమలు చేసిన శిక్షణా కార్యక్రమం ఈ విజయాలకు




పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలో చేరిన ప్రతి విద్యార్థి డిగ్రీతోపాటు ఉద్యోగ అవకాశాన్ని పొందేలా చేసే హామీని నిలబెట్టేందుకు సంస్థ నిరంతర కృషి చేస్తోందని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో మేనేజ్‌మెంట్ పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వం, ప్లేస్‌మెంట్ విభాగం కృషి, విద్యార్థుల నిబద్ధత కలిసి ఈ సంవత్సరాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయని అన్నారు. డిగ్రీ పూర్తికాకముందే విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం సంస్థ విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధకు ప్రతీక అని అన్నారు. విజయోత్సవాల్లో విభాగాధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# భైరవకోనను సందర్శించిన హైకోర్టు జడ్జి సుజాత



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 15**

జిల్లా ప్రఖ్యాత పర్యాటక శైవక్షేత్రం భైరవకోన ను శనివారం హైకోర్టు జడ్జి సుజాత, కనిగిరి జడ్జి రూప శ్రీ సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు జలపాతం ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం భైరవేశ్వర స్వామి, శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని, నగరేశ్వర స్వామి ఆలయాలతో పాటు గుహల్లో ఉన్న వివిధ శివలింగాలను దర్శించుకున్నారు. సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి డి. వంశీకృష్ణారెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు సూచనల మేరకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దేవస్థానం తరఫున శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో అంబవరం మాజీ సర్పంచ్ గుంటిమడుగు వెంకటరామరాజు, ముప్పాళ్ళ విక్రమ్ రాజు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఆలయ అర్చకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అనివేటి మండప నిర్మాణానికి విరాళాలు





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 15**

గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ అనివేటి మండప నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పలు యాలి స్తంభాలు కూడా ఏర్పాటు చేసి ఉన్నారు. అమ్మవారి భక్తులు ఆలయ అనివేటి మండప నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. శనివారం జొన్నలగడ్డ సత్యనారాయణ ధర్మపత్ని కోటేశ్వరమ్మ కుమారుడు మురళీకృష్ణ కోడలు సౌజన్య లు 1,00,000 (లక్ష రూపాయలు) విరాళం శ్రీ అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు లకు ఆలయ ప్రాంగణంలో అందజేశారు. అలాగే మురారి శెట్టి బదరీనాథ్ ధర్మపత్ని సాయి సుధీర కుమారులు వెంకట రాకేష్, వెంకట రాహుల్ కలసి రూ. 25,116 విరాళాన్ని ఆలయ ప్రాంగణంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలకు వారి కుటుంబ సభ్యులకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో కోటి సంతకాల కార్యక్రమం

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 15**

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం పట్టణంలోని 23 వ వార్డు లో ప్రారంభించారు. రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో కందుకూరు పట్టణం లోని 23వ వార్డు లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డు లోని ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే కలిగే నష్టాలను గురించి వివరిస్తూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వారి నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం 23వ వార్డ్ అధ్యక్షులుగా షేక్ మస్తాన్ వలి ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ,రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు గణేశం గంగిరెడ్డి,తల్లపనేని గోపి,షేక్ రహీం,కోటేశ్వరరావు,ఉప్పుటూరి నాగేశ్వరావు,దేవరకొండ ఆదిలక్ష్మి,



మస్తాన్ బాషా, ఫేక్ బాజీ ,షేక్ ఫయాజ్, షేక్ అఫ్జల్,షేక్ సమీర్,షేక్ ఖాదర్,షేక్ సిద్దిక్, షేక్ వసీం,తదితరు పాల్గొన్నారు.

# ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్ 15**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మార్కాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబుఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని స్థానికంగా చేపట్టారు.సార్వజనీన వైద్య సేవలను కాపాడేందుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ నుండి రక్షించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం 13వ బ్లాక్ వైస్ చైర్మన్ టు అంజమ్మ శ్రీనివాస్, 12వ బ్లాక్ ఇన్‌చార్జి మహమ్మద్ ఉస్మాన్, సయ్యద్ ఖలీల్13వ బ్లాక్ అధ్యక్షుడు, షేక్ కరీముల్లా జిల్లా చేనేత ఉపాధ్యక్షుడు ,నాగార్జున , జాఫర్, మహమ్మద్ రఫీ (ఆటో)తో పాటు పలువురు వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# పరిసరాల పరిశుభ్రతలో మహిళల పాత్ర ఎంతో కీలకమైంది



## మార్కాపురం డిఎల్పిఓ సుబ్బారావు

**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 15**

పరిసరాల పరిశుభ్రత లో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని మార్కాపురం డి ఎల్ పి ఓ సుబ్బారావు పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళిక ,పరిసరాల పరిశుభ్రత ,గ్రామాల పరిశుభ్రత అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 13వ తేదీ నుంచి కొమరోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం పొదుపు సంఘాల మహిళలు ,వివోఏలకు పరిసరాల పరిశుభ్రత ,గ్రామాల పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిశుభ్రత పై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చేందుకు కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కొమరోలు ఎంపీడీవో సానికొమ్ము సత్యం అధ్యక్షత వహించగా ,మార్కాపురం డి ఎల్ పి ఓ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ,వీధుల పరిశుభ్రత ,గ్రామాల పరిశుభ్రత, అందరి బాధ్యత అని అంటూ వీటిల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు .ప్రతిరోజు మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత ను పాటిస్తూ తమ ఇంటిని పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాటుపడాలన్నారు .తద్వారా గ్రామాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మానవులే పరిసరాలను అపరిశుభ్రం చేస్తుంటారని ,తిరిగి వారే పరిసరాలను పరిశుభ్రం చేసుకునేందుకు పాటుపడుతుంటారని అన్నారు. ప్రజలను అంటువ్యాధుల నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను అమలు చేస్తున్నదని అందువల్ల అన్ని వర్గాల ప్రజలు ఆ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో సత్యం మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో అవసరం అన్నారు. మహిళలు విద్యావంతులై ఆరోగ్యం అంటు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండగలిగితే ,ఆ కుటుంబం కూడా అనారోగ్యాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలరని తెలిపారు. అందుకు స్వచ్ఛమైన నీరు ,స్వచ్ఛమైన గాలి ,స్వచ్ఛమైన ఆహారం కూడా ఎంత అవసరమని అన్నారు. ఆ కార్యక్రమంలో మార్కాపురం డిఎల్పిఓ సుబ్బారావును ఎంపీడీవో సత్యం, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, పంచాయతీరాజ్ ఏఈ ఈరయ్య, కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య, కొమరోలు గ్రామ సచివాలయం 2 కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండలంలోని వివోఏలు పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సివిల్ సర్వీస్ పరీక్షల సన్నద్ధతకు ఉచిత శిక్షణ



**గిద్దలూరు,పెన్ పవర్, నవంబర్ 15**

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎపి బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలు బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు ఎస్ నిర్మలా జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 25 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోగలరు. దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ టెస్ట్ డిసెంబర్ 5వ తేదీన నిర్వహిస్తారు. ఈ టెస్ట్ లో అర్హత పొందినవారికి డిసెంబర్ 10 నుంచి విజయవాడ నగరం, గొల్లపూడిలోని బిసి స్టడీ సర్కిల్ నందు శిక్షణ ఇస్తారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయడానికి అర్హులైన వారు పదో తరగతి,ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్ల నకళ్ళు,కుల, ఆదాయ ధ్రువీకరణ (ఒక లక్ష మేరకు) పత్రాల నకళ్ళు,ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వాసుపత్రి సముదాయంలోని ఎపి బిసి స్టడీ సర్కిల్ లో ఈ నెల 17 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు 08592-231232, 9989285530, 8985090926

## నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారిని దర్శించుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుములఅశోక్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య టీడీపీ నాయకులు దూండి రాకేష్







**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 15**


రాచర్ల మండలం, నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఈ ప్రాంత వాసుల ఇలవేల్పు నెమలిగుండ్ల రంగనాయక స్వామి ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దూండి రాకేష్ దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో దూండి రాకేష్ నిర్వహించిన సుదర్శన హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## యన్ జి ఓ సంఘం ఒంగోలు తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం - 22న నామినేషన్ల ప్రక్రియ -29న ఎన్నికలు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 15**

ఎ.పి.యన్.జి.జి.ఓ. అసోసియేషన్ ఒంగోలు పట్టణ యూనిట్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభమైంది. ఈ ఎన్నికలకు అధికారి గా కె శివ కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా బి. విజయ్ కుమార్, ఎన్నికల పరిశీలకులు గా జిల్లా కార్యదర్శి ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి లను జిల్లా అధ్యక్షులు కె.శరత్ బాబు నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కె శివ కుమార్ ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఒంగోలు తాలూకా యూనిట్ కు మొత్తం 16 పోస్టులు ఉంటాయని తెలిపారు. అధ్యక్షులు-1, సహధ్యక్షులు -1, ఉపాధ్యక్షులు-4, ఉపాధ్యక్షురాలు (మహిళ) -1, కార్యదర్శి -1, కార్యనిర్వాహక కార్యదర్శి -1, సంయుక్త కార్యదర్శి -5, సంయుక్త కార్యదర్శి (మహిళ) -1 , కోశాధికారి -1 లు ఎన్నుకొనుటకు ఎన్నికల ప్రక్రియను ప్రకటించారు. నామినేషన్ల నమోదు కార్యక్రమం (ఎ.పి.యన్.జి.ఓ. హోమ్, ఒంగోలు నందు) - 22-11-2025 ఉదయం 09 గంటల నుండి మద్యాహ్నం 01 గంట వరకు జరుగును. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, తుది అర్హత పొందిన అభ్యర్థుల ప్రకటన 23-11-2025 సాయంత్రం 5 గంటల వరకు జరుగును. ఎన్నిక అనివార్యమైతే ఎన్నికలు జరుగు సమయం - 29-11-2025 ఉదయం 09 గంటల నుండి మద్యాహ్నం 01 గంట వరకు ఎ.పి.యన్.జి.ఓ. హోమ్, ఒంగోలు నందు జరుగును. 29-11-2025 న అదేరోజు ఎన్నిక పూర్తి అయిన వెంటనే ఓట్ల లెక్కింపు జరుగును.

## మండల వైఎస్ఆర్సిపి యూత్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మన్నేపల్లి శ్రీను



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 15**

మండల వైఎస్ఆర్సిపి యూత్ కమిటీ ఉపాధ్యక్షునిగా మన్నేపల్లి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ విస్తరణలో భాగంగా మన్నేపల్లి శ్రీనును ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేసినట్లు పార్టీ నాయకులు ప్రకటించారు.తన ఎన్నిక సందర్భంగా మన్నేపల్లి శ్రీను మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి పదవి కల్పించిన జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్, మండల వైసిపి అధ్యక్షులు పాలుగుళ్ళ మల్లికార్జున్ రెడ్డి మరియు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు పార్టీ బలోపేతం కోసం యువతను మరింతగా చైతన్యవంతం చేసి, వైసిఆర్సిపి సిద్ధాంతాలను గ్రామ గ్రామాన విస్తరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా శ్రీనుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గఫూర్ ఆధ్వర్యంలో కోడి సంతకాల సేకరణ

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్15**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మార్కాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అన్నా రాంబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పట్టణంలో ముమ్మరంగా జరుగుతుంది. శనివారం స్థానిక18 బ్లాక్ ఇంచార్జ్ సయ్యద్ గఫూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ అయితే జరిగే నష్టాల గురించి వార్డు ప్రజలకు వివరించారు. ప్రైవేటీకరణ వలన పేద ప్రజలకు విద్యతో పాటు వైద్యం కూడా దూరం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని ఈ ప్రైవేటీకరణ ఆపే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, దూదేకుల పిరావలి, పఠాన్ ఇరుఫాన్, మీడిగంటి కాశిరావు, మండ్ల నరసింహ, అక్బర్ భాష, మార్కాపురం టౌన్ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ రఫీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



# కారు ఢీ మహిళ మృతి

## దైవదర్శనానికి వెలుతూ అనంత లోకానికి







**వలేటివారిపాలెం, పెన్ పవర్ నవంబర్ 15**

పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దైవ దర్శనానికి వెళుతూఉండగా ఉదయం 6:30ల సమయంలో కారు ఢీ కొని మహిళ మృతి చెంది అనంత లోకానికి వెళ్లిన సంఘటన శనివారం వలేటివారిపాలెం మండలం మాలకొండ ముఖద్వారం సమీపంలో జాతీయ రహదారి 167బి పై చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వలేటివారిపాలెం మండలం చుండి గ్రామానికి చెందిన ఇరుపని దత్తమణి శ్రీ( 35) భర్త మాదవరావు తో కలిసి మాలకొండ దైవ దర్శనానికి చుండి నుండి కాలినడకన వెళుతుండగా మాలకొండ మెయిన్ ఆర్చీ దగ్గర కు ఉదయం సుమారు 6:30 సమయం అయ్యే సరికి కందుకూరు వైపు నుండి ఏపీ31జె 999నెంబరు గల తెల్లరంగు కారు డ్రైవర్ అతివేగంగా, అ జాగ్రత్త గా హారను కొట్టకుండా వచ్చి అదుపుతప్పి రోడ్డు మార్జిన్ లో నడుచుకుంటూ వెళుతున్న దత్తుమణిశ్రీ ని వెనుక వైపు గుద్దగా ఆమె ఎగిరి పక్కన రోడ్డు మీద పడిపోయింది. ఈ సంఘటనలో ఆమె తల మీద, ఎడమ కాలు గిరక వద్ద బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం ఆమె భర్త దత్త మణి శ్రీ ని కందుకూరు లోని ఏరియా వైద్యశాలకు అంబులెన్స్ లో తీసుకొని వెళుతుండగా సుమారు 7:00గంటల ప్రాంతం లో చనిపోయినట్లు చెప్పారు. ఇరుపని మాదవరావు పిర్యాదు మేరకు ఎస్ ఐ మరిడి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదానాన్ని ప్రారంభించిన బైరెడ్డి, దారపనేని



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, నవంబర్ 15**

కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న హరిహరపుత్ర శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ప్రతి సంవత్సరం నవంబర్ 15వ తేదీ నుండి జనవరి 15వ తేదీ వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం అయ్యప్ప స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న సందర్భంగా పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, ధర్మపత్ని శ్రీమతి విజయలక్ష్మి, మోపాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు ధర్మపత్ని శ్రీమతి ప్రమీల వారి ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప మాల భక్తులకు, ఆంజనేయ స్వామి మాల భక్తులకు, భవాని మాల భక్తులకు, వెంకటేశ్వర స్వామి మాల భక్తులకు అన్నదాన కార్యక్రమం బైరెడ్డి, దారపనేని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ లు గుత్తి వెంకటరాజా, కావిటి వెంకటసుబ్బయ్యలు, రాచూరి సురేష్, ఓగూరి నరసింహారావు, రోశయ్య స్వామి, గోగినేని వెంకటేశ్వర్లు, తిరివీధి హజరత్, దారపనేని నరసింహనాయుడు, యరశింగు రాయుడు, కావిటి నాగేశ్వరరావు దంపతులు, జాజం హరికృష్ణ, అయ్యప్ప స్వామి భక్తులు భారీ సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.